సాక్షి
అనంతపురం
గురువారం । 16 । నవంబర్ । 2023



అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ గౌతమి అధికారులకు సూచించారు. 8లో



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.12, సరాసరి రూ.16 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.



గరిష్టం/కనిష్టం

34.5°/ 17.3°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. పగలంతా ఆకాశం మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

జొన్న రైతులకు అండగా ప్రభుత్వం



అవగాహన కల్పిస్తున్న డీఎం రవీంద్ర

విడపనకల్లు: జొన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని సివిల్ సప్లయీస్ డీఎం రవీంద్ర తెలిపారు. బుధవారం ఉండబండ గ్రామంలో జొన్న రైతులకు ఏఓ పెన్నయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. క్వింటా రూ.3,225 మద్దతు ధరతో జొన్నలను ప్రభుత్వమే పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తుందని డీఎం, ఏఓ తెలిపారు. రైతులు ఎవ్వరూ దళారుల చేతిలో మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు ప్రకాష్‌గౌడు, ఎంపీఈఓ లక్ష్మన్న, వీఆర్వో, సచివాలయ, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీలో అక్రమాలపై విచారణ



ఉద్యోగిని విచారణ చేస్తున్న డీసీహెచ్‌ఎస్‌లు

అనంతపురం మెడికల్: వైద్య విధాన పరిషత్‌లో గత ఏడాది ప్లంబర్, ఎలక్ట్రీషియన్, ఓటీ అసిస్టెంట్ పోస్టులకు నకిలీ సర్టిఫికెట్లు కలిగిన ఏడుగురు అభ్యర్థులను నియమించారని వచ్చిన ఫిర్యాదుపై బుధవారం అనంతపురం సర్వజనాస్పత్రిలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో విచారణ జరిగింది. పోస్టుల భర్తీ అక్రమాలపై అప్పటి కలెక్టర్ నాగలక్ష్మి సీరియస్ అయ్యారు. ఇందుకు బాధ్యులైన సూపరింటెండెంట్లు జగదీష్‌నాయక్, మహబూబ్‌బాషా, సీనియర్ అసిస్టెంట్లు పురుషోత్తం, సంజీవకుమార్‌గౌడ్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. వీరిలో జగదీష్‌నాయక్ ప్రస్తుతం కదిరి, మహబూబ్‌బాషా రాయదుర్గం ఏఓలుగా, పురుషోత్తం ఎమ్మిగనూరు, సంజీవకుమార్‌గౌడ్ కుప్పంలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితో పాటు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొంది తొలగింపునకు గురైన వారి నుంచి విచారణ అధికారులైన గుంటూరు, అనంతపురం డీసీహెచ్ఎస్‌లు సుబ్రమణ్యం రాజు, పాల్ రవికుమార్ స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. గురువారానికి విచారణ పూర్తవుతుందని అనంతపురం డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ తెలిపారు.

డిసెంబర్‌లో జేఎన్‌టీయూ స్నాతకోత్సవం

అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం (జేఎన్‌టీయూ–ఏ) స్నాతకోత్సవం డిసెంబర్‌లో నిర్వహించనున్నారు. వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అధ్యక్షతన బుధవారం యూనివర్సిటీలో పాలకమండలి సమావేశం జరిగింది. అందుబాటులో ఉన్న సభ్యులు నేరుగా, కొంత మంది వర్చువల్‌గా పాల్గొన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది. డిసెంబర్‌లో నిర్వహించే స్నాతకోత్సవంలో ప్రదానం చేయనున్న గౌరవ డాక్టరేట్‌కు సంబంధించి ముగ్గురు ప్రముఖుల పేర్లను పాలకమండలి ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. గతంలో నిర్వహించిన సీఏఎస్ (కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం)కు పాలకమండలి ఆమోద ముద్ర వేసింది. తాజాగా నిర్వహించిన సీఏఎస్‌కు పాలకమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు హరిశ్చంద్రరామ, ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్



అనంతపురం: డిసెంబర్ 9న ఉమ్మడి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు. రెండు జిల్లాల్లోని అన్ని కోర్టులతో పాటు, అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న అన్ని రకాల కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాద కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం, పంచాయతీ/ టాక్స్, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీన సూచించారు.



గిరగిరా తిరగాలి ఫ్యాను: బస్సుపైనుంచి అభివాదం చేస్తున్న దీపిక, ఫ్యాన్ గుర్తు చూపుతున్న మంత్రి ఉషశ్రీ



జనసాగరం: హిందూపురంలో సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభకు విచ్చేసిన అశేష జనవాహినిలో ఓ భాగం

'పురం'.. చైతన్య పథం

బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు... బ్యాక్‌బోన్ క్లాస్ అంటూ పట్టం కట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మద్దతు తెలిపేందుకు బడుగులంతా తరలివచ్చారు. మైనార్టీ కాదు...పాలనలో మెజార్టీ అంటూ పదవులు కట్టబెట్టిన జగనన్నకు కృతజ్ఞత తెలిపేందుకు ముస్లిం, క్రిస్టియన్‌లంతా 'పురం'లో కవాతు చేశారు. ఇన్నాళ్లూ ఓటర్లుగానే ఉన్న తమకు పదవులిచ్చిన జననేత వెంటే తామంతా అంటూ ఎస్సీ, ఎస్టీలంతా ముక్తకంఠంతో నినదించారు. అంతా ఏకమై.. తామంతా జగనన్న వెంటేనంటూ హిందూపురంలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర సాక్షిగా సగర్వంగా చాటిచెప్పారు.

- హిందూపురంలో సామాజిక సాధికార బస్సు యాత్రకు జన ప్రవాహం
- భారీగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలిపిన జనం
- చప్పట్లు చరుస్తూ...ఈలలు వేస్తూ ఉత్సాహం చూపిన అభిమానులు
- 'పురం' నుంచి 'వై నాట్ 175'కు శ్రీకారం
- సభలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రులు గుమ్మనూరు, ఉషశ్రీ
- ఎంపీలు ఆర్.కృష్ణయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ హాజరు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, చిత్రంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పురం సమన్వయకర్త టీఎన్ దీపిక, ఏడీసీసీ చైర్‌పర్సన్ లిఖిత, నదీం అహ్మద్, మీసాల రంగన్న, పైలా నరసింహయ్య తదితరులు

సాక్షి, పుట్టపర్తి

నాలుగున్నరేళ్ల కాలంలో బడుగు, బలహీన వర్గాలకు చేసిన మేలును వివరించేందుకు బుధవారం వైఎస్సార్ సీపీ హిందూపురంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైంది. వైఎస్సార్ సీపీ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో, పురం సమన్వయకర్త టీఎన్ దీపిక పర్యవేక్షణలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించిన సభకు జనం జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. నేతల ప్రసంగాలు ఉత్తేజ పరచగా, జనం ఈలలు, చప్పట్లతో మద్దతు తెలిపారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పలువురు నేతలు మాట్లాడారు.

హిందూపురం నుంచి 'వై నాట్ 175'కు శ్రీకారం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించిన 'వై నాట్ 175'కు హిందూపురం నుంచే శ్రీకారం చుడదామని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మంత్రులు గుమ్మనూరు జయరాం, ఉషశ్రీచరణ్ అన్నారు. టీడీపీని చిత్తుచిత్తుగా ఓడించి.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి.. జగనన్నకు బహుమానంగా ఇద్దామని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ...వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చిన జగన్‌ను మరోసారి సీఎం చేద్దామని పిలుపునిచ్చారు. సభలో ఎంపీలు ఆర్.కృష్ణయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, వక్కళిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, హిందూపురం మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, పామిడి వీరా, చందనశివాజీ పాల్గొన్నారు.

జగన్‌తోనే సామాజిక సాధికారత సాకారం

- డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

హిందూపురం: రాష్ట్రంలో సామాజిక సాధికారత సాకారం చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా అన్నారు. బుధవారం మధ్యాహ్నం హిందూపురంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన మేధావుల సదస్సు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏ విధంగా మేలు చేశామని వివరించే బాధ్యత ప్రజాప్రతినిధులకు సీఎం అప్పజెప్పారన్నారు. గతంలో ఏ సీఎం కూడా ఇలాంటి కార్యక్రమం చేపట్టిన దాఖలాలు లేవన్నారు. మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. 'నవరత్నాలు' అమలులో భాగంగా ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అన్నారు.

జీవితాల్లో మార్పు తెచ్చిన జగన్



సీఎం వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చారు. ఉన్నత చదువులకు సహకారం అందించి.. రాజకీయంగాపైకి తీసుకొచ్చారు. పంచాయతీ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారం కట్టబెట్టిన ఘనత ఒక్క జగన్‌దే. పలు సంక్షేమ పథకాల ద్వారా పేదల కుటుంబాల్లో వెలుగులు నింపిన ఏకైక నేత జగన్ మాత్రమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు ఎంతో గౌరవం దక్కుతోంది. పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా అన్నింటా మహిళా ప్రాధాన్యం పెరిగింది.

– గోరంట్ల మాధవ్, ఎంపీ, హిందూపురం

టీడీపీలో అగ్రవర్ణాలదే పెత్తనం



టీడీపీలో అగ్రవర్ణాలదే పెత్తనం. ఎస్సీ రిజర్వుడు స్థానం మడకశిరలో ఈరన్నను కాదని.. కమ్మ కులానికి ఊడిగం చేస్తున్న గుండుమల తిప్పేస్వామికి టీడీపీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. చంద్రబాబు అంటేనే మోసం. టీడీపీ చేస్తున్న కుల రాజకీయాలను ప్రతి ఒక్కరూ గమనించాలి. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి టీడీపీ వారికి బుద్ధి చెప్పాలి. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఇక్కడికి చుట్టపుచూపుగా వస్తాడు.. ముగ్గురిని తిడతాడు.. ఇద్దరిని కొడతాడు. మళ్లీ ఆర్నెల్లవరకూ కనిపించడు. అలాంటి వ్యక్తికి ఈసారి కర్రకాల్చి వాతపెట్టాలి.

– తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

బాలయ్యను సాగనంపుదాం



నియోజకవర్గానికి చుట్టపుచూపుగా వచ్చే బాలకృష్ణను శాశ్వతంగా హైదరాబాద్‌కే సాగనంపుదాం. ప్రజా సమస్యలు పట్టించుకోని ఆ వ్యక్తి మన ప్రతినిధా? ఏనాడూ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన దాఖలాలు లేవు. షూటింగుల్లో బిజీగా ఉండే బాలయ్యను చిత్తుగా ఓడిద్దాం. వైఎస్ జగన్ సంకల్పించిన 'వై నాట్ 175'కు హిందూపురం నుంచి శ్రీకారం చుడదాం. హిందూపురం కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు బహుమానంగా ఇద్దాం.

– టీఎన్ దీపిక, వైఎస్సార్ సీపీ 'పురం' సమన్వయకర్త

జగన్‌తోనే సాధికారత



ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ సీఎం అయ్యాకే.. బీసీలకు రాజ్యాధికారం దక్కింది. గత పాలకులు బీసీలను ఓటర్లుగా వాడుకున్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ బీసీలను పాలకులుగా గుర్తించి రాజ్యాధికారం కట్టబెట్టారు. ఇలాంటి సీఎం ఉంటేనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉంటారు. మహిళలకు పెద్దపీట వేస్తూ ఎన్నో నామినేటెడ్ పదవులు కట్టబెట్టారు. మహిళలంతా ఆయనకు మద్దతుగా నిలవాలి.

– బోయ గిరిజమ్మ, చైర్‌పర్సన్, జిల్లా పరిషత్

'సైబర్' వల విసిరింది మహిళే..!

- నిందితురాలిది కోయంబత్తూరు
- సులువుగా సంపాదించాలని 'సైబర్' బాట
- పోలీసుల విచారణలో ఒప్పుకున్న వైనం



కోయంబత్తూరుకు చెందిన మహిళను అదుపులోకి తీసుకున్న దృశ్యం

అనంతపురం క్రైం: పోలీసు శాఖను లక్ష్యంగా చేసుకుని విసిరిన 'సైబర్' వలను అనంతపురం పోలీసులు ఛేదించారు. సూత్రధారి తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన మహిళను గుర్తించి, అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్పీ అన్బురాజన్ ఫొటో ప్రొఫైల్‌గా ఉన్న వాట్సాప్ నుంచి ఇటీవల అనంతపురం వన్‌టౌన్, టూటౌన్, రూరల్, ఇటుకలపల్లి సీఐలకు చాటింగ్ చేశారు. 'అర్జెంట్ పనిమీద ఉన్నాను. కొంత డబ్బు పంపించండి' అని ఆ చాటింగ్ సారాంశం. ఈ నంబరు ఎస్పీది కాదని నిర్ధారణకు వచ్చిన తర్వాత వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 'సైబర్' వలను ఛేదించాలన్న ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక పోలీసు బృందం రంగంలోకి దిగింది. దర్యాప్తులో భాగంగా ఫేక్ కాల్, మెసేజ్ వచ్చిన ఫోన్ నంబర్ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందినదిగా గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం కోయంబత్తూరుకు వెళ్లి సైబర్ నేరానికి యత్నించిన విజయలక్ష్మి అనే మహిళను అనంతపురం తీసుకొచ్చి విచారణ అనంతరం అరెస్టు చేశారు. సులువుగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో సైబర్ నేరాల వైపు పయనించినట్లు విజయలక్ష్మి పోలీసుల విచారణలో వెల్లడించారు.

చీటీల పేరుతో టీచర్ కుచ్చుటోపీ

- సస్పెండ్ చేసిన డీఈఓ



రమేష్

అనంతపురం ఎడ్యుకేషన్: చీటీల పేరుతో రూ.కోట్లలో కుచ్చుటోపీ పెట్టి కటకటాలపాలైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి సస్పెండ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ మండలం చాబాల గ్రామానికి చెందిన రమేష్ రాప్తాడు జెడ్పీ హైస్కూల్‌లో బయలాజికల్ సైన్స్ టీచరుగా పని చేస్తున్నాడు. ఈయన అదనపు సంపాదన కోసం చీటీలు (చిట్స్) నడిపేవాడు. వందలాది మంది పరిచయస్తులతో చీటీలు వేయించాడు. అయితే కొంత కాలంగా చీటీలు ఎత్తిన వారికి డబ్బు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. గట్టిగా నిలదీసిన వారికి వడ్డీ ఇస్తానంటూ బుజ్జగించాడు. అలా ఒక్కొక్కరికి నుంచి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా బకాయి పెట్టాడు. ఆగస్టు 31 వరకు పాఠశాలకు వెళ్లాడు. సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 13 వరకు సెలవులోకి వెళ్లిపోయాడు. 14 నుంచి విధులకు హాజరు కాలేదు. హెచ్ఎం నోటీసు జారీ చేసినా స్పందన లేదు. చీటీలు ఎత్తిన తర్వాత డబ్బు ఇవ్వకుండా ముఖం చాటేయడంతో బాధితులు మాచర్ల రాజు, రామకృష్ణారెడ్డి, నరసింహులు, గంగిరెడ్డి, శ్రీనివాసులు గత నెల 16న 'స్పందన'లో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడు నేరుగా కోర్టులో లొంగిపోవడంతో రిమాండ్‌కు మేజిస్ట్రేట్ ఆదేశించారు. రిమాండ్ రిపోర్ట్ ఆధారంగా రమేష్‌ను సస్పెండ్ చేస్తూ డీఈఓ నాగరాజు ఉత్తర్వులు జారీ చేశారు.

చిన్నారుల్లో న్యుమోనియా అరికట్టాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, వైద్యాధికారులు

అనంతపురం అర్బన్: చిన్నారుల్లో న్యుమోనియా అరికట్టాలని కలెక్టర్ గౌతమి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో వైద్యాధికారులతో కలిసి సాన్స్, నేషనల్ న్యూబార్న్ వీక్ పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సాన్స్ కార్యక్రమం కింద ఐదేళ్లకంటే తక్కువ వయసున్న పిల్లలకు ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరుతుంటుందన్నారు. దానిని అధిగమించేందుకు ఫిబ్రవరి వరకు సాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా ఆశా, ఏఎన్ఎం ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు దగ్గు, జలుబు ఉందా లేదా పరీక్షించాలన్నారు. అవసరమైతే ఆస్పత్రికి సిఫారసు చేయాలని చెప్పారు. ప్రతి వెయ్యిమంది పిల్లల్లో ఐదుగురు న్యుమోనియాతో చనిపోతున్నారన్నారు. ఈ మరణాలను తగ్గించాలని ఆదేశించారు. గురువారం నుంచి ఈనెల 27 వరకు నేషనల్ న్యూబార్న్ వీక్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇందులో పురిటి బిడ్డలను క్షేమంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, డీఐఓ యుగంధర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుజాత, డాక్టర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

పక్కాగా అభ్యంతరాల పరిశీలన

- తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి కసరత్తు

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ -2024లో అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను జిల్లా యంత్రాంగం పక్కాగా నిర్వహిస్తోంది. ప్రధానంగా ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫారం-7 కింద వచ్చిన దరఖాస్తులను పకడ్బందీగా విచారణ చేస్తున్నారు. ప్రతి దరఖాస్తునూ బీఎల్ఓ మొదలు ఈఆర్ఓ వరకు ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. ఇక కలెక్టర్ గౌతమి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఈ ప్రక్రియను స్వయంగా పరిశీలిస్తున్నారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది.

2.82 లక్షల దరఖాస్తులు : ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో ఓటరు నమోదుకు (ఫారం-6) సంబంధించి 94,098 దరఖాస్తులు, ఓటు తొలగింపునకు (ఫారం-7) సంబంధించి 87,633 దరఖాస్తులు, ఓటరు వివరాలు మార్పులు, నియోజకవర్గం పరిధిలో ఓటు బదిలీకి (ఫారం-8) సంబంధించి 1,01,227 దరఖాస్తులు మొత్తం 2,82,957 దరఖాస్తులు అందాయి. వీటిలో 20,773 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 1,47,539 దరఖాస్తులను పరిష్కరించారు. 1,14,646 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది.

డిసెంబరు 9 వరకు గడువు

ఇంటింటి సర్వేలో అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 9వ తేదీ నాటికి పూర్తి చేస్తారు. వాటిని సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) డిసెంబరు 26 నాటికి డిస్పోజ్ చేస్తారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను ఈఆర్‌ఓలు 2,024, జనవరి 1వ తేదీన ఇస్తారు. తుది ఓటరు జాబితాను అదే ఏడాది జనవరి 5న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రకటిస్తారు.

క్లుప్తంగా

డీసీఎంఎస్‌లో సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖరరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: అఖిల భారత 70వ సహకార వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన 'పరపతేతర సహకార సంఘాలు–పునరుజ్జీవం–ఆర్థిక చేరిక' అంశంపై చర్చాగోష్టి జరిగింది. సహకార మార్కెటింగ్ సంఘాల ముఖ్య విధులు, సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు... సవాళ్లు, వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందించి సహకార వ్యవస్థ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చంద్రశేఖర రెడ్డి పిలుపునిచ్చారు. సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతమైతే అన్ని వర్గాలకూ మేలు చేకూరుతుందన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఎం.ప్రభాకర రెడ్డి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ టి.విజయ భాస్కర్, అసిస్టెంట్ బీఎం ఎం.సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ వై.సుధాకరరెడ్డి, డీఎల్‌సీఓ జీకే బాలగంగాధర్, సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

17 నుంచి అండర్-19 క్రికెట్ టోర్నీ



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

అనంతపురం: బీసీసీఐ కుచ్‌బెహార్ ట్రోఫీ నేపథ్యంలో ఈ నెల 17 నుంచి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్ల మధ్య అండర్ 19 క్రికెట్ మ్యాచ్‌లు అనంత క్రీడాగ్రామంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రా జట్టు క్రీడాకారులు ఆర్డీటీ స్టేడియానికి చేరుకున్నారు. ఆంధ్రా జట్టు హెడ్ కోచ్ పి.మధుసూదన్‌రెడ్డి, తమిళనాడు హెడ్ కోచ్ అమర్‌నాథ్ పర్యవేక్షణలో బుధవారం ఇరు జట్లు ముమ్మర సాధన చేశాయి. నాలుగు రోజుల మల్టీడే మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు. మ్యాచ్ రెఫరీగా బాలకృష్ణ ముస్కిన్, అంపైర్లుగా అక్షయ్ మరాఠే, భరద్వాజ్, నాగేశ్వరరావును బీసీసీఐ నియామకం చేసింది.

కంత్రీ కాలవా.. ఆరోపణలు మానవా?

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: 'కంత్రీ కాలవ.. ఆరోపణలు మానవా?' అంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులుపై ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. బుధవారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలీబాషాతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరులో టీడీపీ నాయకుడు పట్టపగలే తప్పతాగి వైస్ ఎంపీపీ ఇంట్లో చొరబడి దాడి చేయడం తప్పు కాదా అని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తే అసలు విషయం తెలుసుకోకుండా కాలవ నానా యాగీ చేస్తూ దౌర్జన్యపరుడిని సమర్థించడం సిగ్గుచేటన్నారు.

నిందితులంతా కాలువ అనుచరులే

సర్వే పేరుతో ఏ పేపర్ చదువుతారు? ఏ టీవీ చూస్తారు? మీరు ఏ పార్టీకి ఓట్లేస్తారంటూ సమాచారం సేకరిస్తూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ఓట్లు తొలగించే కుట్రలకు కాలవ పాల్పడ్డాడని గుర్తు చేశారు. ఈ విషయాన్ని తెలుసుకుని లాడ్జిలో ఉన్న పచ్చబ్యాచ్‌ను ప్రశ్నించేందుకు వెళితే తనపై సీసీకెమెరాల డీవీఆర్ ఎత్తుకెళ్లాడనే అభియోగంతో కేసు పెట్టేలా కుట్ర చేశాడని ధ్వజమెత్తారు. కర్ణాటకలోని శివమొగ్గ వద్ద ఇటీవల జిలెటిన్ స్టిక్స్ పేలి పదుల సంఖ్యలో మృతి చెందితే దానిని సైతం తనకు ఆపాదిస్తూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తే తప్పుడు కథనాలు ప్రచురించిన ఆ మ్యాగజైన్ టీడీపీ పట్టణ కన్వీనర్ సోదరుడి కుమారుడిదిగా తేలిందన్నారు. బళ్లారి పోలీసులకు ఇటీవల ఇసుక టిప్పర్ పట్టుబడితే అది కూడా కాపుదేనని ఆరోపించారని, తీరా చూస్తే ఆ టిప్పర్ ఓబుళాపురానికి చెందిన టీడీపీ నాయకుడిదని వెలుగుచూసిందన్నారు. జుంజురాం పల్లి వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ 17 టిప్పర్లు పట్టుబడితే దానినీ తనపై రుద్దాడన్నారు. చూస్తుంటే అవన్నీ టీడీపీ నాయకులవేనని, వాటితో కాలవకు సంబంధం ఉన్నట్టు తెలుస్తోందన్నారు. టీడీపీ హయాంలో నేమకల్లు క్రషర్ వద్ద గొడవ చేశానంటూ తనపై రాజకీయ కక్షతో అక్రమంగా బనాయించిన కేసు పూర్తి అక్రమమని ఇటీవల కోర్టు కొట్టేసిందని గుర్తు చేశారు.

దమ్ముంటే అక్రమ వెంచర్లపై విచారణకు రా

రాయదుర్గం పరిసరాల్లో వెలసిన ప్రతి అక్రమ వెంచర్ టీడీపీ నాయకులదేనని కాపు స్పష్టం చేశారు. ఈ విషయంలో దమ్ముంటే విచారణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. మట్కా నుంచి భూమాఫియా వరకూ మొత్తం టీడీపీ నాయకులే పట్టుబడుతున్నారని, వీటన్నింటి వెనుక కాలవ హస్తముందన్న విషయం స్పష్టమవుతోందన్నారు. 14 ఏళ్లు రాష్ట్రానికి సీఎంగా చంద్రబాబు, 15 ఏళ్లు రాయదుర్గానికి ఎమ్మెల్యేలుగా టీడీపీ ప్రతినిధులు ఉన్నారని, అయినా ఈ ప్రాంత అభివృద్ధిని ఏ ఒక్కరూ పట్టించుకోలేదని మండిపడ్డారు. టీడీపీ హయాంలో మంత్రిగా ఉండి కూడా ఈ ప్రాంత అభివృద్ధికి కాలవ చేసింది ఏమీ లేదన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన ప్రగతిని చూసి మాట్లాడాలని హితవు పలికారు. ఏపీలో జనసేనతో పొత్తు, తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తు అంటూ టీడీపీ అధిష్టానం ప్రకటించిందని గుర్తుచేస్తూ.. తెలంగాణలో బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఓ వెధవతో కలసి కాంగ్రెస్‌కు సపోర్ట్ చేస్తున్న మరో వెధవ కలసి ఏపీలో పోటీ చేయడాన్ని రాజకీయ వ్యభిచారం కాక మరేమంటారో తెలపాలన్నారు. టీడీపీ కండువాలు వేసుకుని కాంగ్రెస్ సభల్లో కూర్చొని ఎన్నికల ప్రచారాలు చేయడం కాలవ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 2024లో టీడీపీ భూస్థాపితం కాక తప్పదన్నారు. రాబోవు ఎన్నికల్లో ఓటమి భయంతో విచక్షణ కోల్పోయి ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు.

దిబ్బలో మృతశిశువు



విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో కరకముక్కల గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న ముస్లిం కబరస్తాన్ వద్ద పేడ దిబ్బలో నవజాత మగశిశువు మృతదేహం బుధవారం లభ్యమైంది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిశువు మృతదేహాన్ని దిబ్బలో పడేసి వెళ్లి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

రెండు రూపాయల బిళ్ల మింగేశాడు!



మయూన్

గుత్తి: ప్రమాదవశాత్తు రెండు రూపాయల బిళ్లను ఎల్‌కేజీ విద్యార్థి మింగేశాడు. వివరాలు... నంద్యాల జిల్లా పోతుదొడ్డి గ్రామానికి చెందిన కృష్ణమోహన్ కుమారుడు మయూన్ గుత్తిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తరగతిలో ఆడుకుంటూ పొరబాటున నోట్లో ఉంచుకున్న రూ.2 బిళ్లను మింగేశాడు. గమనించిన సహ విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలపడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఎక్స్‌రేలో రూ.2 బిళ్ల పేగుల్లో ఉన్నట్లుగా నిర్ధారణ అయింది. దీంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు.

నెట్టికంటుడి కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలి

- ధర్మ ప్రచార వారోత్సవాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వైవీఆర్



ధర్మప్రచార వారోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే మహిమాన్విత క్షేత్రంగా భాసిల్లుతున్న కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ విశిష్టతను దేశంలోని అన్ని రాష్ట్రాలకూ వ్యాప్తి చెందేలా చర్యలు తీసుకుని స్వామి కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేయాలని అధికారులకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డితో కలసి ఆయన విశేష పూజలు నిర్వహించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఇతర సిబ్బంది, పాలకమండలి సభ్యులతో కలసి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 21 ప్రధాన ఆలయాల్లో ధర్మ ప్రచార వారోత్సవాల నిర్వహణను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. స్వామి అనుగ్రహం పొందిన భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అదే రీతిలో ఆలయ అభివృద్ధి కూడా వేగంగా జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను రూపొందించి స్వామి విశిష్టతను దేశవిదేశాలకు వ్యాపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, పాలకమండలి సభ్యులు లోక్‌నాథ్ శర్మ, పాటిల్ రాధిక, గణపర సరోజ, గంతుల రామకృష్ణమ్మ, శోభాశారద, గుంతా రమేష్, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటరాముడు, గంతుల రామాంజనేయులు, వినోద్, వంశి, నాగిరెడ్డి, బాలాంజినేయులు, పవన్, ఆంజనేయులు, మద్దిలేటి, జయరామిరెడ్డి, గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ ఎం.గౌతమి
- వజ్రకరూరులో జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

వజ్రకరూరు: సమస్యలపై ప్రజలు అందజేసే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. వజ్రకరూరులోని మినీ కల్యాణ మంటపంలో బుధవారం జగనన్నకు చెబుదాం – మండల స్థాయి స్పందన గ్రీవెన్స్‌ను నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులందరూ పాల్గొన్నారు. వివిధ సమస్యలపై 78 వినతులు అందాయి. ప్రతి అర్జీని కలెక్టర్ స్వీకరించి, సమస్య తీవ్రతనుపై అర్జీదారుతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలోని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన గ్రీవెన్స్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిందని గుర్తు చేశారు. అందిన ప్రతి అర్జీని పరిశీలించి సంతృప్తికరమైన పరిష్కారం చూపుతున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి జనవరి 26వ తేదీ వరకూ జరిగే వికసిత్ భారత్ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి తదితర వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, వజ్రకరూరు ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచ్ మోనాలిసా, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీఓ విజయలలిత, మండలస్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ యువనేత, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి పాల్గొన్నారు.

బాలల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలి

బాలల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అంతకు ముందు 'అంతర్జాతీయ బాలల దినోత్సవం, మాతృత్వం ఓ వరం – దత్తత దానికి మరో మార్గం' పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. శిశుగృహాలోని చిన్నారుల దత్తత అంశంపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు– బాల్యవివాహాలవల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వివిధ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ సమితి అధికారి వెంకటేశ్వరి, సభ్యులు వసంత రమాదేవి, వైస్ ఎంపీపీ సుశీలారాణి, తదితరులు పాల్గొన్నారు.

'అనంత' అధ్యాపకుడికి అంతర్జాతీయ అవార్డు



అధ్యాపకుడు ఓబిరెడ్డిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్‌ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎన్.ఓబిరెడ్డి అంతర్జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. 110 దేశాల భాగస్వామ్యంతో ఏకేఎస్ గ్లోబల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏటా న్యూఢిల్లీ వేదికగా గ్లోబల్ టీచర్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ ఏడాదికి సంబంధించి ఈ నెల 4న అవార్డులు ప్రదానోత్సవం జరిగింది. ఇందులో ముఖ్య అతిథుల చేతుల మీదుగా 'గ్లోబల్ టీచర్ అవార్డు'ను ఓబిరెడ్డి అందుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాలకు చేరుకున్న ఆయనను ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రాజు, కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి తదితరులు అభినందించారు. కళాశాల ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి, కార్యదర్శి డాక్టర్ కె.నిర్మలమ్మ, వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, ఈసీ సభ్యులు గోపి, ఎర్రిస్వామి, రవీంద్ర, డాక్టర్ రసూల్, ఫిరోజ్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సీఆర్టీలకు శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీల్లో ఇటీవల కొత్తగా నియమితులైన పీజీటీ, సీఆర్టీలకు రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు, జీసీడీఓ వి.మహేశ్వరి వెల్లడించారు. ఈ నెల 21 వరకూ నగర శివారులోని బెంగళూరు–హైదరాబాద్ 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న వైపీ శివారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇండక్షన్ రెండో విడత శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి మొత్తం 214 మంది పీజీటీలు, సీఆర్టీలు హాజరు కానున్నారు. వీరికి 19 మంది రిసోర్స్‌పర్సన్లు, రాష్ట్ర పరిశీలకులు శిక్షణ ఇవ్వనున్నారు.

ఆన్‌సెట్ సీఈఓ బాధ్యతల స్వీకరణ

అనంతపురం కల్చరల్: ఆన్‌సెట్ సీఈఓగా ఎస్.కరుణకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఆర్డీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెను ఇటీవల అనంతపురం ఆన్‌సెట్ సీఈఓగా అదనపు బాధ్యతలిచ్చిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఉదయం యువజన సంక్షేమ శాఖ కార్యాలయానికి చేరుకున్న ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్ఎంయూ నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. జిల్లా చైర్మన్‌గా సూరిబాబు, అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా ప్రతాప్‌నారాయణతో పాటు జోనల్, రీజనల్, డిపో స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయుడులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోనిని మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.

క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే గిరిజనుల అభ్యున్నతి



మాట్లాడుతున్న గుజ్జల లక్ష్మణ్‌కుమార్

అనంతపురం రూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని ఎస్టీ వసతి గృహంలో స్వాతంత్య్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుజ్జల లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. గిరిజనులకు భూ హక్కులు కల్పించాలని బ్రిటిష్ వారిపై దండెత్తారన్నారు. గిరిజనుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవులు అందించి రాజకీయంగా అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు శివశంకర్ నాయక్, సాకే చిరంజీవి, పోలా మహేష్, మహేశ్వరి, పురుషోత్తం, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 35 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివిధ కళాశాలల నుంచి మొత్తం 65 మంది పాల్గొన్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. వారిని కళాశాల చైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వై.మధుసూదన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్ తదితరులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



నూతన ఏసీపీ చంద్రమోహన్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ నూతన ఏసీపీగా కే చంద్రమోహన్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. కమిషనర్ భాగ్యలక్ష్మి వద్ద ఆయన రిపోర్టు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. అహుడాలో ఏపీఓగా ఉన్న ఈయన బదిలీపై అనంతపురం నగరపాలక సంస్థకు వచ్చారు. ఏసీపీ చంద్రమోహన్‌కు టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి తదితరులు అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి మండల పూజలు



చెరువు కట్టపై వెలసిన అయ్యప్ప స్వామి

అనంతపురం కల్చరల్: నగరంలోని చెరువుకట్టపై వెలసిన అయ్యప్ప స్వామికి ఈనెల 17 నుంచి మండల పూజలు ప్రారంభం కానున్నాయి. బుధవారం అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతం వివరాలను తెలియజేశారు. శబరిమల సన్నిధానం నుంచి రాజీవ్ తంత్రి సూచనల మేరకు వచ్చే నెల 27 వరకు 41 రోజుల పాటు మండల పూజలు జరుగుతాయన్నారు. 18వ తేదీ నుంచి రోజూ మధ్యాహ్నం అన్న వసతిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిసెంబర్ 2 నుంచి 4 వరకుమూడు రోజుల పాటు బ్రహ్మశ్రీ రాజీవ్ తంత్రి చేతుల మీదుగా పునఃప్రతిష్టా కార్యక్రమాలు, పూజలు జరుగుతాయన్నారు.

ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు



చిన్నారులను పుష్పగిరి కంటి ఆస్పత్రికి పంపుతున్న దృశ్యం

అనంతపురం మెడికల్: దృష్టి లోపంతో బాధపడుతున్న 15 మంది చిన్నారులకు ఉచిత కంటి శస్త్ర చికిత్సల కోసం వైఎస్సార్ జిల్లాలోని పుష్పగిరి ఆస్పత్రికి పంపేలా ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంది. బుధవారం సదరు ఆస్పత్రి నిర్వాహకులు సర్వజనాస్పత్రి నుంచి ప్రత్యేక బస్సులో చిన్నారులను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ ఈ నెల 14న సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు కంటి స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. దృష్టిలోపంతో ఉన్న వారికి గుర్తించి పుష్పగిరి ఆస్పత్రికి పంపామని, ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని వెల్లడించారు.

సీఎం లక్ష్యం ఆరోగ్యాంధ్రప్రదేశ్

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం జగన్ లక్ష్యం ఆరోగ్యాంధ్రప్రదేశ్ అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం నగరంలో రామచంద్రనగర్‌లోని ఛత్రపతి స్కూల్, గుత్తి రోడ్డులోని మాంటిస్సోరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారితో పాటు వృద్ధులు, మహిళలు, చిన్నారుల్లో ఏమైనా అనారోగ్య సమస్యలుంటే తెలుసుకుని జిల్లా, ఏరియా, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యం అందించేందుకు రూపొందించిన బృహత్తర కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని పేర్కొన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద ఎత్తున వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు.

చిన్నారుల సంఖ్య పెంచాలి..

మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి సంఖ్య పెంచాలని అంగన్‌వాడీ టీచర్లకు ఎమ్మెల్యే సూచించారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ స్టాల్‌ను ఆయన పరిశీలించారు. పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. వైద్య శిబిరం ఏర్పాటుకు సహకరించిన మాంటిస్సోరి స్కూల్ అధినేత సూర్యనారాయణ రెడ్డిని అభినందించారు. 2వ డివిజన్‌లో సచివాలయం ఏర్పాటు చేయించాలని, 3వ సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీను నియమించేలా చూడాలని వైఎస్సార్ సీపీ నాయకులు మిక్చర్ రామకృష్ణా రెడ్డి, రవిలు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు నాగమణి, సుమతి, నాయకులు రవి, అగిలే జనార్దన్ రెడ్డి, అల్తాఫ్, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చైతన్య స్ఫూర్తి భగవాన్ బిర్సాముండ



మొక్కలు నాటుతున్న వలంటీర్లు

అనంతపురం: ఆదివాసుల అస్తిత్వం కోసం పోరాటం చేసిన భగవాన్ బిర్సాముండ యువతకు చైతన్య స్ఫూర్తి అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య అన్నారు. బుధవారం ఎస్కేయూలో ఆయన చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ జమీందారీ వ్యతిరేక ఉద్యమం ద్వారా గిరిజనులను చైతన్య పరిచారన్నారు. ఆయన ఉద్యమ కాంక్షను గుర్తించిన జార్ఖండ్ ప్రభుత్వం యూనివర్సిటీలు, ఎయిర్‌పోర్టులకు స్మారకార్థం ఆయన పేరు పెట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణకుమారి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, ప్రొఫెసర్ మునినారాయణప్ప, ప్రొఫెసర్ వెంకటనాయుడు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రామచంద్ర, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ లక్ష్మీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు బిర్సాముండ

అనంతపురం కల్చరల్: గిరిజన ప్రాంతంలో జన్మించి స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్య్ర సమర యోధుడు బిర్సాముండను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బిర్సా ముండ జయంతిని నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో జన్ జాతీయ గౌరవ్ దివస్ పేరిట బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వైకే డీడీఓ శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్, జయమారుతి తదితరులు ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. ఎంతో మంది త్యాగధనులు దేశం కోసం సర్వం అర్పించారని, వారి ఆదర్శాలను పాటించాలని సూచించారు. వలంటీర్లు ప్లకార్డులతో బిర్సాముండ త్యాగాన్ని నినాదాలు చేస్తూ గౌరవం ప్రకటించుకున్నారు. కార్యక్రమంలో ప్రగతి పథం నిర్వాహకులు పవన్, శేషాద్రి, నందిత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ జేడీగా వెంకటేష్

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రమణ్యం బుధవారం నుంచి 15 రోజుల పాటు సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ జేడీగా ఉరవకొండ డివిజన్ డీడీ డాక్టర్ కె.వెంకటేష్ బాధ్యతలు తీసుకున్నారు.

అనస్తీషియా వైద్యంపై వర్క్‌షాపు

అనంతపురం మెడికల్: అనస్తీషియా వైద్యంలోని నూతన పద్ధతులు, విధానాలపై వైద్యులు, పీజీ విద్యార్థులకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో బుధవారం వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన అనస్తీషియా వైద్యుడు డాక్టర్ సుధీర్ మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు వర్క్‌షాపును ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెయిన్ రిలీఫ్ క్లినిక్‌లో రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

అనంతపురం టవర్‌క్లాక్: రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కుమారస్వామి కోరారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ 450 మండలాలనూ కరువు ప్రాంతాలుగా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు కొనకొండ్ల రాజేష్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌పై దృష్టి సారించాలి



ఆత్మకూరు: పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

అనంతపురం: సివిల్ సర్వీసెస్ పరీక్షలపై విద్యార్థి దశ నుంచే దృష్టి సారించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. రెండో రోజైన బుధవారం నదీం అహమ్మద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పుస్తక ప్రదర్శనను తిలకించారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సర్వీసులు సాధిస్తే సమాజ సేవ చేయడానికి వీలు కలుగుతుందన్నారు. గ్రూప్–2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు షైన్ ఇండియా చొరవతో నమూనా పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 350 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలు, వృత్తలేఖనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి మాట్లాడుతూ.. షైన్ ఇండియా ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహించడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి. రమ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ఆత్మకూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల, పాఠశాల విద్యార్థులకు పుస్తకాలపై పలు విషయాలను గ్రంథాలయ అధికారి నల్లమ్మ కూలంకషంగా వివరించారు.

సంక్షేమం, అభివృద్ధి పరుగులు

- గతంలో ఎన్నడూ లేని విధంగా నగరాభివృద్ధి
- డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య



వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ గోపినాథ్ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నగరం ముఖచిత్రం మారిపోయిందని, సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 5వ డివిజన్ 8వ సచివాలయం, 8వ డివిజన్ 11వ సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. సంక్షేమ, అభివృద్ధి బోర్డులను వారు ఆవిష్కరించారు. ఖాజానగర్, రాణినగర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి సంబంధించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వారు వివరించారు. సంక్షేమం, అభివృద్ధినందించిన ప్రభుత్వానికే తాము తోడుగా ఉంటామని, ఏపీకి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే ఉండాలని స్థానిక ప్రజలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరం నలుదిక్కులా అభివృద్ధి జరిగిందన్నారు. పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ప్రగతి సాధించారన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ బయన బోయిన గోపినాథ్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు జయలలిత, సుమతి, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అనంతపురం రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్ అన్నారు. బుధవారం అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఉండేదో ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల దయ ఉంటేనే సంక్షేమ పథకాలు అందేవని గుర్తు చేశారు. గత ప్రభుత్వ పాలనకు ఈ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను గమనించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్‌శంకర్, ఉప సర్పంచ్ సుమిత్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకూ న్యాయం

కనగానపల్లి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగాలంటే ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ అన్నారు. మండలంలోని దాదులూరు గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులంతా కలసి గ్రామ సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిపై నోటీస్ బోర్డులు ప్రదర్శించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సర్కిల్లో వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, రమణారెడ్డి, సర్పంచ్ మురళి, పంచాయతీ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మరోసారి సీఎంను చేసుకుందాం

రామగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకూ సమన్యాయం సాధ్యమని మండల కన్వీనర్ కత్రా హనుమంతరెడ్డి అన్నారు. మండలంలోని గంతిమర్రి సచివాలయంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాల పట్టికను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మరోసారి సీఎంగా వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం గంతిమర్రిలోనే రాత్రికి పల్లెనిద్ర కార్యక్రమానికి నాయకులు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ ఫజిల్‌బాషా, ఈఓఆర్డీ రాధాక్రిష్ణ, నాయకులు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు..



వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: రాష్ట్ర భవిష్యత్తుకోసం మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలపించాలని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారాం చెన్నేకొత్తపల్లి సచివాలయం– 2పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనశ్రీ, నాయకులు హనుమంత డ్డి, చిన్నా, బొగ్గు కిష్ట, ఎస్‌టీ డీ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలసాహిత్యంతో సమగ్ర వికాసం

అనంతపురం కల్చరల్: బాల సాహిత్యంతో సమగ్ర వికాసం సాధ్యమవుతుందని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బాలసాహిత్య పరిషత్ అధ్యక్షుడు చొక్కాపు వెంకటరమణ అన్నారు. బుధవారం అంతర్జాలం ద్వారా 'ఎస్ఆర్ఐ' ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేటి తెలుగు బాల సాహిత్య విస్తరణ అనే అంశంపై సదస్సు జరిగింది. ఫౌండేషన్ చైర్‌పర్సన్ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చొక్కాపు వెంకటరమణ, ప్రఖ్యాత గజల్ గాయకులు శ్రీనివాస్, డీకే చదువుల బాబు, బాలసాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటరమణ, పైడిమర్రి రామకృష్ణ, గుత్తా హరి మాట్లాడారు. సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ,సాకేశ్రీహరిమూర్తి, న్యాయవాది నరేష్, బాల సాహిత్య వేత్త చొప్పా వీరభద్రప్ప, సురేంద్ర ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు.

కరువు సహాయక చర్యలు చేపట్టండి

కనగానపల్లి: ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో వెంటనే రైతులను ఆదుకునేలా సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో సమావేశమై కరువు పరిస్థితులపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మహదేవ, మండల అధ్యక్షుడు గోవిందు, నాయకులు ఈశ్వరయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆట వస్తువుల పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

కనగానపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు అధికారులు ఆట వస్తువులు, వంట సామాన్లు పంపిణీ చేశారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వాటిని అందజేశారు. అలాగే శానిటరీ వస్తువులు, సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రామన్న తదితరులు పాల్గొన్నారు.

సజావుగా వేలంపాట

అనంతపురం టవర్‌క్లాక్: కురుబ సంఘం ఆధ్వర్యంలో కనకదాస కల్యాణ మంటపం మూడేళ్లపాటు నిర్వహణకు వేలం నిర్వహించినట్లు కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక కనకదాస కల్యాణ మంటపంలో జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి సూర్యప్రకాష్ బాబు మాట్లాడుతూ 10 మంది పాల్గొనగా బండి కాశీ విశ్వనాథ్ రూ.22.50 లక్షలకు దక్కించుకున్నారన్నారు. డబ్బును సంఘం అకౌంట్‌లో డిపాజిట్ చేస్తామన్నారు. ప్రతి రూపాయిని కల్యాణ మండపం అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల కృష్ణయ్య, ట్రెజరర్ తోపుదుర్తి శీనయ్య, వసికేరి శివ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిరుతల విటల్ గౌడ్, బ్యాళ్ల నాగేంద్ర, బండి ఆదినారాయణ, కాటమయ్య, నారాయణస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

64 మంది అడ్మిన్లకు మెమోలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న 64 మంది అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులకు మెమోలు జారీ అయ్యాయి. ఈ నెల 14న ఉదయం 8 గంటలకంతా క్షేత్రస్థాయిలో పర్యటించి పన్ను వసూళ్లకు సంబంధించి డ్రైవ్ చేపట్టాలని గతంలో అడ్మిన్లను నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేసిన 64 మంది అడ్మిన్లకు మెమోలను అదనపు కమిషనర్ రమణారెడ్డి జారీ చేశారు.

గ్రామాల్లో సమస్యలు రానివ్వొద్దు



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

ఆత్మకూరు: గ్రామాల్లో గొడవలు, కక్షలు లేకుండా ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనని, ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి పోలీసులకు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ను డీఎస్పీ తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి వేగంగా వాహనాలు నడుపేవారు, లైసెన్స్ లేని వారు, పరిమితికి మించి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా రోడ్డు నిబంధనలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో చోరీలు జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: రోగుల మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ హేమలత సూచించారు. బుధవారం ఆత్మకూరులోని ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తూ మందులను అందుబాటులో ఉంచిందన్నారు. అయితే ఇక్కడ కొన్ని రోగాలకు సంబంధించి మందులు లేవన్న విషయాలను స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. మందులు కొరత ఉన్నప్పుడు ఉన్నతాధికారులు లేదా ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురాకుండా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారంటూ మండిపడ్డారు. డాక్టర్ సబిహా సుల్తానా మాట్లాడుతూ కొన్ని మందులు లేవని ఉన్నతాధికారులకు తెలిపామని, ఇక్కడ లేకపోయినా ఇతర ఆస్పత్రుల నుంచి తీసుకువస్తున్నామన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడతూ మందుల కొరతను ఉన్నతాధికారులతో పాటు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

అనంతపురం అర్బన్: 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' పథకం కింద జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణ అంశంపై కలెక్టర్ బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెలాఖరులోగా 31,336 ఇళ్ల నిర్మాణం లక్ష్యం నిర్దేశించగా.. ఇప్పటి వరకు 7,511 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. ప్రత్యేకదృష్టి సారించి ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. ఇబ్బందులు ఉంటే తెలుసుకుని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.